# ఆన్‌లైన్‌లో టీఎస్‌పీఎస్సీ మార్కులు

- సాఫ్ట్‌వేర్ సిద్ధం చేసిన సీజీజీ
- ఈ నెల 20 నుంచి అందుబాటులోకి?

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించిన పరీక్షలు రాసిన ఉద్యోగార్థులు తమ మార్కుల వివరాలను ఇక ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చు. నియామకాలు పూర్తయిన తర్వాతే ఈ వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచుతారు. ఆన్‌లైన్‌లో మెమో రూపంలో మార్కులు వెల్లడించేందుకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్సు (సీజీజీ) రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఈ నెల 20 నాటికి అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీ అభ్యర్థులకు మార్కులను మెమోల రూపంలో ఇస్తోంది. రూ.200 చలానాతో దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత గడువు తర్వాత మార్కులు అందజేస్తుంది. కొత్త సాఫ్ట్‌వేర్ సాయంతో అభ్యర్థులు సీజీజీ నిర్ణయించిన ఫీజు చెల్లించి, ఆన్‌లైన్‌లోనే మార్కుల మెమోను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థి మార్కులను పొందేందుకు ఆ పరీక్షకు దరఖాస్తు సమయంలో ఇచ్చిన మొబైల్ నెంబరు తప్పనిసరిగా నమోదు చేయాలి. ఆ నెంబరుకు వచ్చిన వన్‌టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ)ని నమోదు చేస్తేనే ఆన్‌లైన్‌లో మార్కుల వివరాలు తెలుస్తాయి. వివరాలు గోప్యంగా ఉంచేందుకు ఈ ఓటీపీ విధానాన్ని ప్రవేశపెట్టారు. అభ్యర్థి తన మార్కులు మాత్రమే తెలుసుకునేఏర్పాటుచేశామని, తోటిఅభ్యర్థుల మార్కులు ఇవ్వబోమని కమిషన్‌వర్గాలు స్పష్టం చేశాయి.

## నాలుగు నెలల్లో పోస్టుల భర్తీ

వైద్య విభాగంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఫలితాలను వెల్లడించేందుకు టీఎస్‌పీఎస్సీ కసరత్తు పూర్తి చేసింది. త్వరలోనే మెరిట్ జాబితా ప్రకటించి, ఇంటర్వ్యూలు నిర్వహించనుంది. గ్రూప్-2పై న్యాయస్థానం ఇచ్చే ఆదేశాలమేరకు ముందుకు వెళతామని కమిషన్ వర్గాలు తెలిపాయి. ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ)కి 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపికచేసేందుకు కసరత్తు పూర్తి చేసినట్లు వివరించాయి. జిల్లాస్థాయిలో ధ్రువపత్రాల పరిశీలించిన తర్వాత టీఆర్‌టీపై హైకోర్టు ఆదేశాల మేరకు ఎంపిక జాబితాలు ప్రకటించాలని ఆలోచిస్తున్నాయి. స్టాఫ్‌నర్సు, అటవీ శాఖల్లోని దాదాపు 7 వేల పోస్టులకు ఫలితాలు త్వరలోనే వెల్లడిస్తామన్నాయి. టీఆర్‌టీ, గురుకులాలు, స్టాఫ్‌నర్సు, అటవీ శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ పోస్టుల ఎంపిక జాబితాలు వెల్లడైతే ఇప్పటి వరకు వెలువరించిన నోటిఫికేషన్ల లక్ష్యం పూర్తవుతుందని కమిషన్ వర్గాలు చెబుతున్నాయి. సీఎం ఇచ్చిన హామీ మేరకు పంచాయతీరాజ్ శాఖ గ్రామ పంచాయతీ అధికారుల పోస్టులకు సంబంధించి ఉత్తర్వులు వెల్లడైతే వాటితో కలిపి దాదాపు 6 వేల పోస్టులతో గ్రూప్-4 వెలువరించాలని భావిస్తున్నాయి.

### ఇదీ టీఎస్‌పీఎస్సీ ప్రగతి

| | |
|---|---|
| ఉద్యోగ ప్రకటనలు | 83 |
| ఖాళీల సంఖ్య | 30,490 |
| భర్తీ చేసిన ఉద్యోగాలు | 11,333 |
| ఫలితాల వెల్లడి దశలోని పోస్టులు | 18,714 |
| పరీక్షలు జరగాల్సిన పోస్టులు | 571 |
| ప్రభుత్వ విభాగాల నుంచి ప్రతిపాదనలు అందాల్సిన పోస్టులు | 4,375 |